కథా నిలయం
శ్రీకాకుళం

ఆలోచన - అనుభూతి

హాలంతా జనంతో క్రిక్కిరిసింది. కొత్త తెలుగు చిత్రం మొదటి రాత్రి మొదటి ఆట ఆడుతోంది. కథ చకచక సాగిపోతోంది. సన్నివేశాల్లో ప్రతిబింబించే వాస్తవికత కథా సంవిధానంలో ఆసక్తిని కలిగిస్తూండటంవల్ల ప్రేక్షకులు కథాగమనంలో లీనమౌతున్నారు.

యువతీ యువకులు _ నాయికా నాయకులు _ అన్యోన్యం ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు. గృహప్రవేశం జరిగింది. రాత్రి. నాట్యరాణి నాట్యప్రదర్శనం. కలవాళ్లు మరి. అందులో, నాయకుడు స్థానిక ప్రముఖుడు. ఔచిత్య భంగం లేదు. నాట్యరాణిని దంపతులకి పరిచయం చేస్తున్నారు.

"ప్రసిద్ధ నర్తకి......" వగైరా, వగైరా.

"పెళ్ళికుమారుడు_పురప్రముఖుడు", వగైరా, వగైరా.

నాయకుడు చిన్నగా నవ్వాడు సవినయంగా.

రాణి—నాట్యరాణి—ఓరగా చూసింది. నవ్వింది. అందులో కొంటెతనం ఉంది.

ఆ నవ్వు !

స్త్రీలకై ప్రత్యేకించిన స్థానంలో ఫస్టుక్లాస్ సోఫాలో కూచున్న మనోరమ గుండె గతుక్కుమంది. ఆ నవ్వు ఆమెకి నచ్చలేదు. కొత్తగా పెళ్ళయిన యువతీ యువకులు. వాళ్ళ ముందర రాణి అలా నవ్వటం—అన్యాయం.

మనోరమ ముఖం చిట్లించుకుంది.

పరిచయం అయింతరవాత నేపథ్యంలోకి వెళ్ళబోతూ రాణి మరోసారి వాలుగా నాయకుడివైపు చూసింది. అతనూ అదే సమయంలో చూశాడు. ఆమె చిన్నగా నవ్వింది. అత నామెవైపు అలాగే చూస్తున్నాడు.

నాయకు డలా చూడటం ఫస్టుక్లాసులో పురుషుల ప్రత్యేక స్థానంలో కూచున్న రంగారావుకి నచ్చలేదు.

పెళ్ళయి రెండు రోజులు కాలేదు.

అతనలా ఆమెవైపు చూస్తాడేం !

నాయిక నాయకుడిని నెమ్మదిగా తట్టింది. అతడు ఉలిక్కిపడి ఆమెవైపు చూసి చిన్నగా నవ్వి ఆమెచేతిని తన చేతిలో తీసుకున్నాడు.

రంగారావుకి తృప్తిగా ఉంది.

రంగారావుకి కూడా కొత్తగా పెళ్ళయింది. భార్య అందం చూసి మురిసిపోతాడు.

వెంటనే రంగారావుకి భార్య జ్ఞాపకం వొచ్చింది. ఆమె మరెక్కడో లేదు. అదే హాల్లో స్త్రీల మొదటి తరగతిలో సుఖాసీనురాలై ఉంది. ఓసారి అటువైపు చూశాడు, ఆమె కనిపించటానికి వీల్లేదని తెలిసినా.

నాట్యం అద్భుతంగా ఉంది. అంటే రంగారావుకని గానీ, ప్రేక్షకులకనిగానీ అర్థం కాదు. నాయకుడు ఊరికే తల తిప్పుతున్నాడు. రాణీ అతని వైపు మందహాసంతో చూస్తూ అభినయిస్తోంది.

అలా నాయకుడు తలతిప్పటం రంగారావు కేమాత్రం నచ్చలేదు. తన కంతగా నాట్యం విషయం తెలియకపోవటం వల్లగాని, ఎక్కువగా తెలియటం వల్లగాని రంగారావు కలా అనిపించిం దనుకోటం సరికాదు. నాయకు డలా తలతిప్పక పోతే ఆ వేషధారిస్థానే మరో వేషధారి బుక్ కాక తప్పదని తెలియనంత అమాయకుడుకాడు రంగారావు. అయినా నాయకు డలా తిప్పడం అతని కిష్టంలేదు.

రాణి అలా నాయకుడివైపు చిలిపిగా చూడటం మనోరమకి గుర్రుగా ఉంది.

నాట్యం ఐపోయింది. నాయకుడు తెగచప్పట్లు కొట్టే శాడు—అందరితోపాటు. నాయిక మర్యాదకోసం అర చేతులు రెండూ రెండుమూడుసార్లు కలిపింది.

గ్రీన్‌రూమ్‌లో నాయకుడు రాణిని అభినందిస్తు న్నాడు—కాదు—పొగిడేస్తున్నాడు.

అది రంగారావు కిష్టంలేదని వేరే చెప్పక్కర్లేదు. రాణి వయ్యారంగా, విలాసంగా అజంతా భంగిమలతో ఆకర్షిస్తోంది.

ఆ అంగవిన్యాసం మనోరమకి కంటకంగా ఉంది.

నాయకుడిచూపులు రంగారావుకి అసహ్యంగా ఉన్నాయి.

రాణి నాట్యం ఏమంత గొప్పతరగతికి చెదిందికాదు. ఆ విషయం నాయకుడికి తెలుసు. అయినా ఆమెని పొగి డేస్తున్నాడు. కాని పొరపాటున ఓ చిన్నమాట తూలాడు. రాణి వెంటనే చిర్రు బుస్సుమంది. ముఖం ముకుళించుకుంది.

మనోరమ ముఖం విప్పారింది.

రంగారావు సంతోషించాడు.

నాయకుడు పొరపాటుకి పశ్చాత్తాపపడ్డట్టుగా ముఖం పెట్టాడు.

"మీరు సహృదయతతో స్వీకరిస్తారనుకున్నాను", అన్నాడు.

రాణి వేషం విప్పుకుంటూ—

ఆమె నిర్లక్ష్యధోరణికి మనోరమకు ఏహ్యాభావం కలిగింది.

"అదేమిటి? అత డలాగే నుంచుంటాడేం?" అని ముఖం చిట్లించుకున్నాడు రంగారావు.

రాణి వేషం విప్పుకుంటూ నిర్లక్ష్యంగా నాయకుడి దగ్గరగా వచ్చి విచారకరంగా ముఖం పెట్టి, "మీది రసహృదయం అనుకున్నాను. కాని..." అని ఆగింది.

"క్షమించాలి", అన్నాడు నాయకుడు.

"మగవాళ్ళంతా ఇంతే", అంది రాణి.

విస్తుపోయాడు రంగారావు.

మనోరమ ఆశ్చర్యపోలేదు. ఆమెకి కొంచెం జాలి కలిగింది.

"సున్నితహృదయాలని గాయపరచటానికి ఏమీ సంకోచించరు."

"హుఁ", అనుకున్నాడు రంగారావు.

"క్షమించాలి", అన్నాడు నాయకుడు మళ్ళీ.

"మీరు తప్పుచేశారని ఒప్పుకుంటున్నారా?"

"నిస్సంకోచంగా," అన్నాడు నాయకుడు, తనేమీ తప్పు చెయ్యలేదని లోపల అనుకున్నా.

"తప్పుచేసినవాళ్లు శిక్షకి లోబడటం సభ్యత," నాయకుడు నవ్వాడు. "ఏమిటా శిక్ష ?"

"రేపు మా ఇంటికి టీకి రావాలి", నవ్వింది. నాయకుడూ నవ్వాడు.

ఆ నవ్వులు మనోరమ కేమీ నచ్చలేదు.

రంగారావు కంతకంటే బావుండలేదు.

నాయిక కాఫీట్రే తెస్తోంది.

నాయకుడు పేపరు చూస్తున్నాడు.

కాఫీ రెడీ.

నాయకుడు కప్పు అందుకోలేదు. తల నెమ్మదిగా తిప్పి నాయిక వైపు చూసి ఏదో సంజ్ఞ చేశాడు.

నాయిక చిరునవ్వు నవ్వింది. కాఫీ కప్పు నాయకుడి నోటి కందిస్తుంటే చెయ్యి పట్టుకున్నాడు.

"ఇష్ !"

కాఫీ కొంచెం రుచిచూసి—

నాయిక వైపు కొంటెగా చూసి—

కాఫీ కప్పు ఆమె నోటిదాకా...

రంగారావుకి ఆనందంగా ఉంది.

దగ్గు—చిన్నది.

ద్వారంవైపుకి కళ్లు పరిగెత్తాయి.

"డాన్‌డాన్", అన్నట్టుగా ప్రేక్షకులు ఈలవేశారు.

ప్రవేశం రాణి!

మనోరమ హృదయం గతుక్కుమంది.

నాయిక కాఫీ రుచి చూడలేదు.

నాయకుడి చెయ్యి ఆగిపోయింది.

రంగారావుకి విచారం వేసింది.

టీ కప్పులో తుఫాను. "రావొచ్చునా?" అంది రాణి, కొత్తగా పెళ్ళయిన యువతీ యువకుల్నీ, కప్పుల్నీ చూస్తూ.

"రండి", అన్నాడు నాయకుడు.

"మీ ఆనందానికి అడ్డొచ్చినట్టున్నాను."

"పరవాలేదులెండి." అన్నాడు నాయకుడు కంగారుగా. దేనికి పరవా ? ఒళ్లు మండింది రంగారావుకి. అదేం మాట !

రాణి వొచ్చినకారణం నాయకుడిని మళ్ళీ ఇంకోసారి టీకి ఆహ్వానించటానికి—జ్ఞాపకం చెయ్యటానికి. ఆమె శ్రమకి నాయకుడు నొచ్చుకున్నాడు.

"ఒకసారి పిలిస్తే మీలాంటివాళ్లు మాఇళ్ళకొస్తారా?" అంది రాణి.

మనోరమ నిట్టూర్పు విడిచింది.

"అహఁహఁ...ఎంతమాట! ఎందుకు రాను?" నాయకుడు సవినయంగా అన్నాడు.

"క్షమించాలి. తీరికలేదు," అని నాయకుడు ఎందుకనడు అని రంగారావుకి కోపం వొచ్చింది.

నాయకుడికీ, రాణికీ జోస్తీ ఎక్కువౌతోంది.

రంగారావు దాన్ని ఏమాత్రమూ ఆమోదించలేదు. ఈ విషయంలో రంగారావు ఏకాకి కాడు. తన చుట్టూఉన్న జనం చిన్నగా చేస్తూన్న వ్యాఖ్యానాలు—రాణీ ప్రవేశించినపుడల్లా చిత్ర విచిత్రమైన ధ్వనులూ రంగారావు వింటూనే ఉన్నాడు.

నాయకుడిమీద చాలామందికి కోపం వొస్తోంది.

మంచివాడల్లేనే కనిపిస్తాడే—

నువ్వు నా దగ్గరికి రావొద్దని గట్టిగా చెప్పెయ్యడేం?

చెప్పేస్తే బాగుండును.

అలా చెప్పేస్తే కథ జరగటం కష్టమని రంగారావుకి తెలియకపోలేదు. కాని ఆ విషయం గురించి అత నేమీ ఆలోచించటంలేదు. ఆలోచించాలని తోచలేదు అతనికి.

టీ కోసం రాణి ఇంటికి నాయిక వెళ్ళదు. అది ఆమె కిష్టంలేదు. నాయకుడు వెడతాడు. అదీ ఆమె కిష్టంలేదు. కాని ఆమెకి భర్తమీద ఇష్టం. అందుకని అయిష్టం కనబడ నీయదు.

రాణీతో కబుర్లు—నాయకుడు రాణి ఇంటిదగ్గర. అతడు గడియారం చూసుకుంటున్నాడు మాటిమాటికీ. అది రాణీకి కోపకారణం.

రంగారావుకి సంతోష కారణం.

"ఆగిపోయిందా?" విసుగ్గా అడిగింది రాణీ.

"ఎబ్బె, లేదు."

"మరి అన్నిసార్లు చూస్తారేం ?"

"టైమెంతయిందో నని..."

ఏవో కబుర్లు.

మళ్ళ గడియారం మీదికి నాయకుడి కళ్ళు.

"గడియారం తప్పితే ఇక్కడ చూసి ఆనందించ తగిన విం కేమీ లేవా ?"

చటుక్కున తల పైకెత్తాడు నాయకుడు. ముఖంలో కొంత వింత కనిపించింది. ఆమె ముఖంలోకి చూశాడు. అదే కావాలిసింది—రాణికి.

"క్షమించాలి."

రాణీ నవ్వింది.

"అన్నిసార్లు క్షమించమని అడక్కూడదు."

నాయకుడి కేమనాలో తెలీలేదు. గడియారంవైపు చూడటం— పరాయింట్లో పరాయివాళ్ళ ఎదట ఎక్కువ సార్లు—మంచిది కాదేమోనని అతని కనిపించి ఉండవచ్చు; గడియారంవైపు మాత్రం చూడటంలేదు. బహుశా నిమిషాలు లెక్కపెట్టుకుంటున్నాడేమో. పరాగ్గా ఉన్నాడు. రాణి ఏదో అడిగితే జవాబివ్వలేదు. ఆమె దగ్గరగా వొచ్చింది. ఆ అలికిడికి మేల్కొని గాభరాపడ్డాడు. తన చెయ్యిమీద అకస్మాత్తుగా రాణీ చెయ్యి—

నాయకుడు తికమకపడ్డాడు.

మనోరమ నిరాశపడ్డది...ఈలలూ, కేకలూ!

నాయకుడు "షాక్", తిన్నట్టు లేచి నుంచోడేం? రంగారావు మనసులో అదే ఆలోచన.

నాయకుడి మర్దు చెయ్యి తొలగించి చూసి "ఆరుకి ఆరు సెకండ్లు తక్కువ", అంది. అతని కర్థం కాలేదు. తెల్లబోయి చూశాడు.

"మీరు నిమిషాలు లెక్కపెట్టుకుంటున్నట్టుగా ఉంటే, టైం చెప్పాను."

తన పొరపాటు అర్థమైంది నాయకుడికి. తను పరాగ్గా ఉన్నట్టు కనిపెట్టింది. కనుబొమలు ఎగరేశాడు.

"క్షమించాలి", అన్నాడు తన కర్తమైనట్లు చెప్ప డానికి. రాణీ నవ్వింది. "ఎన్నిసార్లు?"

నాయకుడికీ నవ్వొచ్చింది.

నాయకుడికి అకస్మాత్ గా ఆమె స్పర్శ జ్ఞాపకం వొచ్చినట్టుంది. చెయ్యివైపు చూసుకున్నాడు.

రాణీ ఓరగా చూసింది.

ఆ చూపు!

ఆ వయ్యారం!

మనోరమకి అసహ్యం కలిగింది.

అలాగే రాణి చూస్తోంది—నాయకుడి కళ్ళూ తనవీ కలిసేదాకా, నాయకుడు తికమకపడ్డాడు. టైం ఐపోతోంది.

ఇంటిదగ్గర నాయిక చూస్తోంది గడియారం. టైం ఐపోతోంది. నాయకుడు గడియారం చూడకూడదు. పట్టు చెయ్యి గడియారం కప్పేసింది. బీచ్ కి పోయే టైం దాటి పోతోంది. నాయిక మేడమీదనించి చూస్తోంది...

అకస్మాత్ గా జ్ఞాపకం వొచ్చింది నాయకుడికి — బీచ్ ప్రోగ్రాం. భార్య కళ్ళలో మెదిలింది — ఎదురు చూపులతో —

రంగారావు సంతోషించాడు.

నాయకుడు మొహమాటస్థుడు. వెళ్ళాలి. ఎలా? సందేహిస్తున్నాడు.

ఏమిటలా ఇదవుతాడేం? ఠకీమని లేచి వెళ్ళిపోలేడూ? రంగారావుకి కోపంగా ఉంది.

నాయిక ముఖం ముకుళించింది.

రంగారావుకి కూడా—

కాలెండర్ మీద తారీకులు మారిపోతున్నాయి.

అల్లుడికీ, కూతురుకీ పండగ ఆహ్వానం.

నాయకుడికి పనితొందర. తీరిక లేదు

నాయిక ఒంటరిగానే వెళ్ళింది.

ఆ విషయం రాణీకి తెలిసింది.

ఆహ్వానం...పండక్కి. టీ మాత్రమే కాదు. డిన్నర్.

నాయకుడికి అంత ఇష్టంగా లేదు.

మొహమాటస్థుడు.

ఆ విషయం రాణీకి తెలుసు—మొదటినించీకూడా.

ఆ దౌర్బల్యం—

రంగారావుకి కోపకారణం.

ఆ దౌర్బల్యవినియోగం రాణీకి తెలుసు. ఉపయోగించింది.

అన్యాయం అనుకుంది మనోరమ.

ఆ రాత్రి...

మనోహరమైన వెన్నెల.

మేడమీద ఖాళీ డాబాలో ఈజీఛైర్‌లో నాయకుడు.

రాణీతో కబుర్లు.

డిన్నర్ గురించి పొగిడేస్తున్నాడు.

తాంబూలం ఇచ్చింది రాణి.

సిగరెట్ స్వయంగా వెలిగించటానికి సిద్ధపడ్డది.

మొహమాట పడ్డాడు—తికమకపడ్డాడు—నాయకుడు.

"అతిథులకి ఆమాత్రం సేవచేస్తే తప్పేంలేదు", అంది రాణి.

ఈజీఛైర్ లో పడుకున్న నాయకుడు ముందుకి వంగాడు మర్యాదగా. రాణీకూడా వంగింది.

"అబ్బా", అంది రాణి.

రెండు తలలూ ఢీకొన్నాయి. ఈలలూ, చప్పట్లూ.

"క్షమించాలి."

నవ్విందామె.

అతనూ నవ్వాడు. "దెబ్బ తగిలిందా ?"

"ఉఁహుఁ."

మనోరమకి వొళ్లు మండింది.

ఎందుకు తగుల్తుంది.

అన్యాయం.

రాణిమీద మనోరమకి అసహ్యం ఎక్కువైంది. రాణి సిగరెట్ వెలిగిస్తోంది నాయకుడికి.

నాయకుడామెవైపు తేరిపార చూస్తున్నాడు.

నిప్పుపుల్లలు ఆరిపోతున్నాయి.

అవి అలా ఆరిపోతూనే ఉంటాయని మనోరమకి తెలుసు. చాలామందికి తెలియకపోవచ్చు.

నాయకుడు రాణీవైపు చూస్తూనే ఉన్నాడు.

వెన్నెల పడి తెల్లచీర మెరుస్తోంది.

వెన్నెల పడి ముఖపద్మం ఆకర్షణీయంగా ఉంది.

ఆమె అందాలన్నీ చూస్తున్నాడు నాయకుడు.

ఆ నల్లటి శిరోజాలూ, ఆ నున్నటి బుగ్గలూ...

సిగరెట్టు వెలిగింది.

రాణీ తల పైకెత్తింది.

పట్టుబడ్డాడు నాయకుడు.

"ఏమిటలా చూస్తున్నారు?" చిరునవ్వుతో అడిగింది. తొట్రుపడ్డాడు.

"చెప్పండి, పరవాలేదు."

తల తమాషాగా తిప్పుతూ అంది. ఆ తిప్పటంలో తలలో గులాబీ పువ్వు కింద పడ్డది. పువ్వువైపు చూసింది రాణి. తీసుకోలేదు. నాయకుడుకూడా చూశాడు. తీశాడు. చెయ్యి చాపలేదు రాణీ. ఈజీఛైర్ లోంచి లేచాడు. ఓరగా చూసి వెనక్కి తిరిగింది రాణి. తలలో పెట్టాడు.

ఉన్నట్టుండి గిర్రున తిరుగుతూ నృత్యం ప్రారంభించింది రాణి. తన్మయుడై చూస్తున్నాడు నాయకుడు ఆ భంగిమలు...!

మనోరమ ముఖం చిట్లించుకుంది.

రంగారావు పూర్తిగా ఆశలు వదులుకున్నాడు.

అలిసిపోయి గిర్రున తిరుగుతూ సోఫాలో పడిపోయింది రాణి. నాయకుడు సమీపిస్తున్నాడు.

"ఏదైనా, అకస్మాత్ గా జరగకూడదూ ?" అనుకున్నాడు రంగారావు, జరగదని తెలిసి.

"టెలిగ్రాం రాకూడదూ ?" అనుకుంది మనోరమ. నాయకుడు దగ్గరికి వొచ్చేస్తున్నాడు.

అకస్మాత్ గా ఏ తీవ్రమైన తలనొప్పో—

మరేదో, ఇంకేదో, ఏదో వొస్తే...

ఏదీ ఎవరికీ రాలేదు.

దగ్గరగా వొచ్చి నుంచున్నాడు నాయకుడు.

రాణి అతనివైపు తమాషాగా చూసింది.

సంకోచిస్తున్నాడు నాయకుడు.

తలలో గులాబిపువ్వు తీసింది రాణి.

నాయకుడు తొట్రుపాటు పడ్డాడు.

రంగారావు ఆశపడ్డాడు.

గులాబీపువ్వు మంచంమీదికి విసిరింది రాణి.

రంగారావు విషాదంగా ముఖం పెట్టాడు.

మనోరమ తల పక్కకి తిప్పుకుంది. ఆమెకి బాధగా ఉంది. ఆమెకి మొదటినించీ రాణినిచూస్తే అలాగే ఉంది. కోపం, చిరాకు, అసహ్యం. కోపం వొచ్చినప్పుడల్లా, చిరాకు పడ్డప్పుడల్లా, అసహ్యం వేసినప్పుడల్లా హృదయంలో ఏదో ఆవేదన...ఏదో బాధ. ఏదో జరగాలని కోరిక. కాని మనసులో—నేపథ్యంలో సన్నని స్వరంలా—అప్పుడప్పుడు ఏదో అకస్మాత్ గా జ్ఞాపకం వొస్తుంది. అయితే ఆ జ్ఞాపకాలు

పైకిరావు. ఆమెకి తీరిక లేదు—రాణిని చూస్తున్నంతసేపూ. హృదయంలో ఏదో లోటు. అందుకే మనసు ఆలోచించదు. అనుకోకుండా గట్టిగా నిట్టూర్పు విడిచింది మనోరమ. అక స్మాత్‌గా మళ్ళీ గతించిన దృశ్యాల జ్ఞాపకం. కాని ఆమె అలిసిపోయింది. ఆలోచించేస్థితిలో లేదు.

రాణినిచూస్తే ఆమెకి ఏవగింపు.

ఆమె జయించటం మనోరమ కిష్టంగాలేదు.

ఆమె ఓటమి—నాయకుడామెని తిరస్కరిస్తే...

అదే మనోరమ లోలోపలి కోరిక.

రాణీ ఓ కల్పితపాత్ర. ఆవిషయం మనోరమ, హృద యంలో ఏదో బాధగా కదిలినప్పుడల్లా జ్ఞాపకం చేసు కుంటూనే ఉంది. అయినా—

రాణీ ఒక వేశ్య.

మనోరమకూడా.

మనోరమ ఇంత స్పష్టంగా ఆలోచించలేదు. అయినా ఆ విషయం ఆమెకి మనసులో మారుమూల అడుగడుగునా అడ్డు తగులుతూనే ఉంది.

తెరమీదరాణీ—

మనోరమకళ్లు చూస్తున్నాయి.

మనసుకి పనిలేదు. హృదయంలో అనుభూతులు. మనోరమ వేశ్య. చిన్నప్పుడు నాట్యం నేర్చింది. ఇంతవరకూ నర్తకిగా అంత పేరేమీలేదు. రంగస్థలంమీదచేసిన కొద్ది నాట్యప్రదర్శనలూ ఎక్‌స్ట్రా హోదాలోనే—ఎవరిట్రూపు

లోనో. ఓ శ్రీమంతుడి వివాహ సందర్భంలో నాట్య ప్రదర్శన ఏర్పాటయింది. తమదే ట్రూపు. పరిచయంచేశారు ట్రూపులో అందర్నీ. ఫలానా...ఫలానా—"మనోరమ" ఆ శ్రీమంతుడు ఓ చూపు గిరవాటేసి తల పక్కకి తిప్పాడు. ఆమెకి కష్టంవేసింది. ప్రదర్శనలో అందరికంటే ఎక్కువగా ఆకర్షించాలని చూసింది. ఎవరూ తనవైపే చూస్తున్నట్లు లేదు. తనకి సామర్థ్యంలేక కాదు. డబ్బులేక సొంత ట్రూపు ఏర్పాటు చేసుకోలేకపోయింది. ఆమెకి ఉక్రోషం వొచ్చింది. ఎలాగైనా పైకిరావాలి. సాధించాలి. ఈ శ్రీమంతుడికి నాటకాలూ ఇత్యాదులంటే అభిమానం అని వినికిడి. వొంటరిగా కలుసుకుని సహాయం అడిగింది. అంత మొత్తం సహాయంకాని—పెట్టుబడికాని—ఇవ్వటం అతని కిష్టంలేదు. అదే నసిగాడు. తళుకుబెళుకులతో ఆకర్షించటానికి ప్రయత్నించింది. కాని కొత్తగా పెళ్ళయిన మోజులో ఉండటంవల్లనేమో తన వలలో పడలేదు. తనకే పేసుంటే—

ఈ విషయమంతా మనోరమ మర్చిపోయిందనికాదు. రాణిని చూస్తున్నంతసేపూ తను మనోరమకాక మరో స్త్రీ అనీ ఆమె అనుకోలేదు. అసలామె ఆలోచించే దేమిలేదు. ఆలోచించే స్థితిలోలేదు. అన్నీ ఏమేమిటో అనుభూతులు.

మనోరమ రాణీని అసహ్యించుకుంటూ ఉంది.

రంగారావు నాయకుడిమీద ఆశలు వొదులుకున్నాడు.

కథ సాగిపోతోంది. సంఘటనలు జరిగిపోతున్నాయి. నాయిక అశాంతితో కుంగిపోతోంది. ఘర్షణ జరగక తప్ప

లేదు. నాయకుడు ఏదో అన్నాడు. నాయికకి అభిమానం ముంచుకొచ్చింది. పుట్టింటికి వెళ్ళిపోయింది. నాయకుడు పట్టించుకోలేదు. నెలలు గడిచిపోయాయి. అభిమానం విడిచి నాయిక సొంత ఇంటికి బయల్దేరింది. ఇల్లు తాళం వేసి ఉంది. చుట్టుప్రక్కలవాళ్లు — రాణీతో ఊళ్లు తిరుగుతున్నాడనీ, ప్రస్తుతం వాళ్ళిద్దరూ ఫలానా ఊళ్లో ఉందని-అన్నారు. తను ఎప్పుడూ వెళ్ళి ఎరగని ఊరు. అయినా పట్టుదలతో వెళ్ళింది. స్టేషన్ దాటగానే ఎలా వెళ్ళాలో, వాళ్లు ఎక్కడున్నారో అనే అధైర్యం లోపల పీకుతూనే ఉన్నా సైకిల్ రిక్షా ఎక్కితే అతనే తీసుకువెడతాడనే ధైర్యంతో ఓ సైకిల్ రిక్షావాలాని కేకేసి అడిగింది. అతను నాయికవంక కొంచెం అనుమానంగా చూశాడు—ఆమె ధోరణినిబట్టీ, ఆదుర్దానిబట్టీ. "నిమిషంలో తీసుకెడతాను ఎక్కండి", అన్నాడు. నాయిక రిక్షా ఎక్కి కూచుంది. జనసమ్మర్దం ఎక్కువగా ఉన్న రోడ్లన్నీ దాటిపోతోంది రిక్షా. రాను రాను ఇళ్లుకూడా కనిపించటం లేదు. దారి తప్పినట్టు నాయికకి అనుమానం వేసింది. అడిగింది. ఓ వెకిలినవ్వు నవ్వి లేదులెండన్నాడు రిక్షావాలా.

ఆ నవ్వు—ఆ ధోరణి—ఆ వేగం!

నేల తరగతిలో కూర్చున్న ఓ రిక్షావాలాకి గుండెల్లో గుచ్చుకుంది. కొత్త తెలుగుచిత్రం చూడాలని—రిక్షా అద్దె మూడున్నర గంటలు దండగైనా, సాహసించి హాలుదగ్గర ఓ కిల్లీకొట్టు యజమానిని చూచూండమని—హాలులో కూర్చుని బీడీ కాల్చుకుంటూ వినోదిస్తున్న ఆ ఒకానొక రిక్షావాలా ఏమేమిటో జరగాలనుకున్నాడు.

రిక్షా ఆగింది.

"ఏం ?" అంది నాయిక.

వెకిలిగా నవ్వి దిగమని డబాయించాడు—ఆమె వెలగల నగలవైపు చూస్తూ.

అన్యాయం.

అసలే కష్టాలు. పైపెచ్చు ఇదోటి—

హాల్లో రిక్షావాలా బాధపడ్డాడు.

ఏదైనా జరిగి—

తెర నాలుగువైపులూ చూశాడు.

రిక్షావాలా దౌర్జన్యం చేసేట్టున్నాడు. ఏంచేస్తాడో ! పాపం నమ్మి వచ్చింది.

బీడీ కాల్చటం మానేశాడు రిక్షావాలా.

నేల తరగతి ప్రేక్షకులు—తన చుట్టూ ఉన్నవాళ్లు—తిడుతున్నారు. తనూ తిడుతున్నాడు.

ఎదురుగా టాక్సీ—

ఈలలు, చప్పట్లు—నేల తరగతి ప్రేక్షకుల్నించి. ఉద్రేకం ఆపుకోలేక చిరునవ్వుల రూపంలో వొదిలేస్తున్నారు పై తరగతి ప్రేక్షకులు. ఆనందబాష్పాలు తుడుచుకుంటున్నారు కొంతమంది జేబురుమాళ్ళతో.

టాక్సీ—రిక్షా.

పారిపోయాడు రిక్షావాలా.

బీడీ జ్ఞాపకం వొచ్చింది హాల్లో రిక్షావాలాకి.

టాక్సీలో—నాయకుడూ, రాణీ.

నాయకుడూ, నాయికా పరస్పరం చూసుకున్నారు. పలకరించుకోలేదు. కారు తలుపు తీశాడు నాయకుడు. నాయిక లోపల కూర్చుంది...

కథ జరిగిపోతుంది. నాయికా, నాయకుడూ, రాణీ ఒక్క ఇంట్లోనే ఉంటున్నారు. లేక, నాయకుడూ, రాణీ ఉన్న ఇంట్లోనే నాయికకూడా ఉంటోందనటం సమంజసం. ప్రస్తుతం నాయిక హోదా అటువంటిది. ఇదే ఇంట్లో రాణీ తాలూకు వరస సోదరుడు—ట్రూప్ వ్యవహారాల్లో జోక్యం కల్పించుకుంటూ ఉండే వ్యక్తికూడా ఉంటున్నాడు.

నాయిక కష్టాలు పడుతోంది మానసికంగా. ఆమెకి అనేక అన్యాయాలు జరుగుతున్నాయి.

జనం—హాల్లో ప్రేక్షకులు—సానుభూతి చూపిస్తున్నారు. అన్యాయానికి బాధపడుతున్నారు. అన్యాయాన్ని ఖండిస్తున్నారు.

నాయిక కష్టాలుచూసి రాణీ సోదరుడు, ఓ ఉపన్యాసం ఇచ్చేశాడు నాయికకి. ఆమె స్థితిచూస్తే తనకి మనసూ, హృదయమూ ద్రవించి ఏకమయాయన్నాడు. ఇహ కష్టాలు పడక్కర్లేదన్నాడు. భారతనారి తిరుగుబాటు చెయ్యాలన్నాడు. నాయికలాంటి చదువుకున్న యువతి — నవీన విద్యాప్రవీణురాలు — ప్రవర్తించే విధం అది కాదన్నాడు. దుక్కకాటుకి చెప్పుదెబ్బే నన్నాడు.

నాయిక వింటోంది.

రెండోతరగతి ప్రేక్షకుడైన రామ్మూర్తికి ఈ ఉప న్యాసం ప్రమాదకరంగా కనిపించింది. ఆమె దౌర్బల్యాల మీద వొత్తిడి తెస్తున్నాడు—దుర్మార్గుడు, విలన్.

రామ్మూర్తికి వొళ్లుమండుతోంది.

తనామెని ప్రేమించానన్నాడు విలన్. బాగా ఆలోచించుకునే సమాధానం ఇవ్వమన్నాడు. అక్కర్లే దంది నాయిక.

రామ్మూర్తి సంతోషించాడు.

తనని నాయిక అర్థంచేసుకోవాలని ప్రాధేయపడి, అది ఆమెకే మంచిదని సలహాఇచ్చి వెళ్లాడు విలన్.

బెదిరిస్తున్నాడు రాస్కెల్ — అనుకున్నాడు రామ్మూర్తి. అలా అనుకోటం రామ్మూర్తి కొంచెం భయంభయంగా అనుకున్నాడు.

నాయిక జీవితం పాడైపోతుందేమోనని భయం. అలా అనిపించగానే హృదయంలో బెరుకుతోపాటు మనసులో లీలగా తన గత జీవితంలో ఓ సంఘటన మెదిలింది. కాని రామ్మూర్తి ఆలోచించటానికి సాహసించలేదు.

రామ్మూర్తి ఆ ఊరికి కొత్తగా వొచ్చిన బి. ఇడి. అసిస్టెంట్. అంతకి ముందున్న ఊరినించి ఓ చిన్న ఉపద్రవం తప్పించుకోటానికి ఈ ఊరు వొచ్చేశాడు. మరేంలేదు. ఏదో బుద్ధిచాంచల్యంవల్ల ఎదురింటి ప్లీడర్‌గుమాస్తాగారి రెండో భార్యతో వ్యవహారం జరపటానికి ప్రయత్నిస్తే ఆయన తన్నించినంత పనిచేశాడు. ఆ హడావిడికి బతుకుజీవుడా అని ఇలా వొచ్చేశాడు.

విలన్ ప్రయత్నాలు మానలేదు.

ఆ సాయంత్రం నాయకుడితో చెప్పింది — విలన్ ఇలా బాధిస్తున్నాడని. "మహా పతివ్రతలా నన్ను పట్టుకొని వేళ్లాడమని ఎవడేడిశాడు. కాపలా కూచోమంటావా?" అన్నాడు. అభిమానం ఘోరంగా దెబ్బతింది నాయికకి.

నాయకుడూ, రాణీ సినిమాకి వెళ్లారు.

నాయిక ఆలోచిస్తూ కూర్చుంది.

నాయిక తిరుగుబాటు చేయాలని వాదిస్తుంటే—

అంతరాత్మ సహనం కావాలంటోంది.

ఆ సమయంలో విలన్ దగ్గరగా వొచ్చాడు. కాళ్ల మీద పడ్డాడు దాదాపు.

రామ్మూర్తి ఊపిరి బిగబట్టాడు.

నాయిక భవిష్యత్తు?

ఆమె దౌర్బల్యం అన్యాయంగా వినియోగించుకుంటున్నాడు విలన్. ఆమె జీవితం!

విలన్ ఆమెని దగ్గరికి తీసుకోబోయాడు— "డౌన్ డౌన్".

బలంగా తోసేసింది నాయిక.

భేష్—రామ్మూర్తి గట్టిగా ఊపిరివొదిలి తీరిగ్గా కూచున్నాడు.

దౌర్జన్యం చేస్తున్నాడు విలన్—

బుద్ధిచెప్పింది నాయిక.

రామ్మూర్తికి సంతోషంగా ఉంది.

కథ చకచక సాగిపోతోంది.

అన్యాయాలు—అధర్మం—నైచ్యాలు—ఘోరాలు. ఎన్నెన్నో జరుగుతున్నాయి.

ప్రేక్షకులు సానుభూతి చూపిస్తున్నారు. అన్యాయం, అధర్మం జరిగినప్పుడల్లా నిరసిస్తున్నారు. ఏదైనా అడ్డు రావాలని కోరుకుంటున్నారు.

న్యాయం, ధర్మం జయించినప్పుడెల్లా— సంతోషం తెలియచేస్తున్నారు.

చప్పట్లూ ఈలలూ,

జేబు రుమాళ్లూ, చిరునవ్వులు.

కోపగిస్తున్నారు.

కళ్లు తుడుచుకుంటున్నారు.

నాయిక కష్టాలు చిత్రం ఆఖరుకి తుదముట్టాయనీ చెప్పనక్కర్లేదు. నాయకుడు పశ్చాత్తాప పడ్డాడని చెప్పాలిసిన అవసరంలేదు.

చిత్రం పూర్తి కావస్తోంది.

రంగారావు లేచాడు. మళ్లీ జనం మూగితే పోవటం కష్టం—అందులో ఆడవాళ్ళతో. కారుడ్రైవర్ నిద్రపోతూ ఉంటాడేమో. గబగబా హాల్లోంచి బయటికొచ్చాడు రంగారావు. దూరాన కారుంది. డ్రైవర్ కూడా అక్కడే ఉన్నాడు. స్త్రీల గేటుదగ్గర నుంచున్నాడు. ఎంతసేపటికీ రారేం? పూర్తిగా చూడటాని కేముంటుందనో. కామెడీ

యేగా. అన్ని చిత్రాల్లోకిమల్లేనే, వొచ్చెయ్యకూడదూ, త్వరగా. ఆడవాళ్లతో వస్తే ఇదే తంటా.

ఒక్కొక్కరే వొస్తున్నారు.

ఆ వొచ్చే దెవరు, తన భార్యేనా ? కాదు—ఎవ రీమె ? ఎక్కడో చూసినట్టుందే ! ఎక్కడబ్బా ? ఎప్పుడు ?

ఆమెవైపు జ్ఞాపకం తెచ్చుకోటానికి తదేకంగా చూస్తున్నాడు రంగారావు. ఆమె తలెత్తి చూసింది. ఎందుకు అలా చూస్తున్నాడు తనవైపు రంగారావు ? రంగారావు! దగ్గరగా వొచ్చింది. రంగారావు పరధ్యానంగా ఆమెవైపు అలా చూస్తూనే ఉన్నాడు.

ఆమె ముందు కొచ్చింది. రంగారావుకి దగ్గరగా నిలబడ్డది.

"ఏమిటలా చూస్తున్నారు ? మర్చిపోయారా ?"

రంగారావు బిత్తరగా చూసి, పరధ్యానంనించి మేల్కొని తొట్రుపాటు పడసాగాడు.

"నేనండీ, మనోరమని. మర్చిపోయారల్లేవుంది. మాలాంటివాళ్లు మీకు జ్ఞాపకం ఉంటారా ఏమిటి గాని—"

"ఎబ్బెబ్బె...జ్ఞాపకమే." ఇప్పుడు తెలిసింది రంగారావుకి. ఆమె నర్సు మనోరమ. తన జ్ఞాపకశక్తి హీనతకి కొంచెం చింతించాడు.

మనోరమ మాటలు కలిపింది.

"ఇలా నిలబడ్డారేం. మీ వాళ్లకోసమా?"

"అవునండీ."

ఎలక్ట్రిక్ లైటు వెలుతురులో క్రేప్‌సిల్క్ చీర మెరుస్తోంది. అలాంటి చీర తన భార్యకి కూడా కొనాలని పించింది రంగారావుకి. తన కిలాంటి విషయాలు పట్టవు. కాని ఆ సమయంలో అది చాలా బావుందనిపించి కొనాలని పిస్తోంది. ఆ మాటకొస్తే ఆ వల్వెట్ చోళీ మాత్రం! నిగనిగలాడుతూ — ఎర్రగా — కళ్లు జిగేల్ మన్నాయి రంగారావుకి.

మనోరమకి ఆ సంగతి తెలుసు. వయ్యారాలు వొలకబోస్తూ అందాలు విరజిమ్ముతోంది.

ఇదేమి టివాళ అనుకోకుండా రంగారావు తనవైపు అలా చూస్తున్నాడేం? అతన్ని ఆకర్షించటానికి తను ఎన్ని ప్రయత్నాలు చేసింది! అప్పుడేమీ తొణకని మనిషి—!

మనోరమ నిజంగా అందంగల మనిషే ననిపించింది రంగారావుకి. నిజానికి తన భార్యకంటే కూడా. నర్తనలో కృషిచేసినమనిషి. కాబట్టి శరీరం తీగలా ఉంది—నాజూకుగా. ముఖంలో మంచి కళ కనిపిస్తోంది. లావణ్యవతి.

మనోరమ చేతిగడియారం చూసుకుంది. అది గమనించాడు రంగారావు. అప్రయత్నంగా గేటువైపు చూశాడు—తన భార్య వొస్తోందేమోనని. ఇంకా రావటం లేదు. 'పోనీలే నెమ్మదిగా వస్తుంది.' అనుకున్నా డతడు.

"ఎక్కడా ప్రదర్శన లివ్వటంలేదా?" అడిగాడు, ఏదో అడగాలి కనుకా.

"ఏదీ, మీలాంటి గొప్పవాళ్లు ఏర్పాటు చేయిస్తేగా." నవ్వాడు రంగారావు.

"అయినా, మాలాంటి చిన్నచిన్నవాళ్లమీద ఉంటుందా ఏమిటిలెండి మీ చూపు."

కొంచెం చివుక్కుమంది మనస్సు రంగారావుకి. "పాపం," అనుకున్నాడు. బయటికి "అదేంమాట," అన్నాడు. మనోరమ ప్రత్యుత్తరంగా నవ్వింది, కావాలని కొంచెం కులుకుతూ. క్రేప్ సిల్కు బుజంమీద సరిగా ఆనటంలేదు. ఆమె సరిచేసుకుంది. అంటే బుజంపైకి లాక్కొని రెండో కొన చుట్టూ తిప్పి చేతో పట్టుకుంది. కాని...విద్యుద్దీపకాంతిలో వల్వెట్ చోళీ మెరుస్తోంది. వల్వెట్ చోళీమీదికి మనసుపోయిన రంగారావుకి అది ఆహ్లాదకరంగా ఉంది...

మనోరమ సవరించుకుంది—సరిగా.

సిగ్గుపడ్డాడు రంగారావు.

గేటువైపు చూశాడు, కొంచెం భయంగా—అయిష్టంగా.

"కారు తెమ్మన్నారా, సార్."

డ్రైవర్ అడుగుతున్నాడు. అటు చూశాడు.

"అమ్మగారు కొంచెంసేపటికిందే వెళ్ళిపోయారు. తల నొప్పిగా ఉందని."

"ఓ", రంగారావుకి ఎందుకో కొంచెం తేలికగా ఉంది.

"రండి. లిఫ్ట్ ఇస్తాను."

"థాంక్స్."

చీకట్లో దూసుకుంటూ పోతోంది కారు...

జనం కిటకిటలాడిపోతున్నారు, హాలుముందు.

రిక్షాలు, బళ్ళు, జనం...

బేలగా చూస్తోంది ఒక అమ్మాయి, పల్లెటూరి మనిషిలా కనిపిస్తోంది, చిన్నవయస్సు. ఏదో పోగొట్టుకున్నట్టుగా చూస్తోంది.

"రిక్షా అమ్మగారూ." "రిక్షా" "రిక్షా".

కేకలు.

"స్టేషన్‌కి వొస్తావా ?"

ఒంటరిగా స్టేషన్‌కి—ఆ అమావాస్య రాత్రి. ఏవూరి నించి, ఎక్కడికి...

రిక్షావాలాకి సందేహం కలిగింది.

"ఎక్కండి", అన్నాడు.

"ఎంత...?"

మాటవరసకి అడిగినట్టుగా అడిగింది. ఆ అమ్మాయి ఎక్కడో, ఏదో ఆలోచిస్తోంది.

"విచిత్రం", బేరంలో అతని కిష్టంలేదు. పోటీ. పైగా సినిమాకెళ్ళి మూడున్నరగంటలబేరం పోగొట్టుకున్నాడు. ఏదోవిధంగా కూడదియ్యాలి...

ఆ అమ్మాయి రిక్షా ఎక్కింది.

రిక్షావాలా హుషారుగా ఉన్నాడు. సినిమా మాంచి హుషారిచ్చింది. బాగా తీశారనుకుంటూ, సినిమాలో ఘట్టాలు జ్ఞాపకం చేసుకుంటున్నాడు.

"ఇటేనా స్టేషన్?"

అకస్మాత్ గా వినిపించింది అతనికి. ఊహాలోకంనించి తిరిగి "ఇదేనండి", అన్నాడు. ఆ అమ్మాయిని గురించి ఆలోచిస్తున్నాడు. చెప్పకుండా ఇంటినించి వొచ్చిన రకం అని తెలుస్తూనే ఉంది. ఏ రెండో పెళ్ళి సంబంధం వొద్దనో— లేక ఏ పోట్లాటవల్లో, నగలతో ఒంటరిగా—

"ఇటేనా స్టేషన్ ?"

మళ్లీ అడిగింది. రిక్షావాలా 'అవు' నన్నాడు. వెంటనే అతనికో కొత్త ఆలోచన కలిగింది. అటువెడితే స్టేషన్ వొస్తూంది—మరోపక్కకి వెడతే—నిర్జనం. నగలు! ఒక్క నగచాలు—జీవితం హాయిగా కొన్నాళ్లు...ఒక్కటిచాలు... అవన్నీ ఎంత ఖరీదు చేస్తాయో !

రిక్షా పోతోంది.

ఆ అమ్మాయికి అనుమానం వేస్తోంది.

జనం కనిపించరేం ? ఎవరైనా జనం తిరుగుతూ ఉంటే బావుండును. ఎదురుగా ఎవరన్నా వొస్తే ఆపి, 'స్టేషన్ ఇటేనా ?' అని అడిగితే—

"నేను వొచ్చిన దోవ ఇదికాదే", అనుమానంగా అంది.

"అది వొచ్చేదారి, ఇది వెళ్లేదారి."

కొంత తృప్తిపడ్డది...కాని...

రిక్షా పోతూనే ఉంది.

ఎవరూ జనంగాని — బండీగాని ... టాక్సీగాని, టాక్సీ!—

ఏమీ ఎదురురాకుండా ఉంటే...

రిక్షావాలా ఆలోచిస్తున్నాడు ...

రంగారావుగారి కారు పరుగెత్తుతోంది.

చీకటి. రంయిమని చలిగాలి కొడుతోంది కారు కిటికీల్లోంచి. గతుకుల రోడ్డు.

బ్యాక్ సీటులో కూర్చున్నారు రంగారావూ, మనోరమా.

మనోరమ అలా నిర్లక్ష్యంగా సీటుకి జేరగిలబడి కూచుంటుందేం?

రంగారావుకి ఏమిటోగా ఉంది.

మల్లెపూల వాసన.

మనోరమ మాట్లాడుతుంటే రంగారావు వింటు న్నాడు—అర్థంగురించి అంతగా అతడు పట్టించుకోటంలేదు. ఆమె ఏదో చెబుతోంది. అతడు వింటున్నాడు. ఆమె గొంతు సన్నగా బావుంది. వినా లనిపిస్తోంది.

గాలికి చీరచెంగు రప్పమని రంగారావు ముఖానికి కొట్టుకొంది.

"సారీ", అంది.

"పరవాలేదు," అన్నాడు.

కారు కేదో అడ్డొచ్చింది. సడెన్ బ్రేక్.

రంగారావు తూలాడు. మెత్తగా......భయపడ్డాడు రంగారావు.

"సారీ",

"పరవాలేదు", మనోరమ నవ్వింది.

పరవాలేదు! దూరంగా జరగడేం?

దొంగతనంగా మనోరమవైపు చూడాలనిపించింది. చూశాడు. ఆమెకూడా చూసింది.

చిన్న చిన్న కుదుపులకే రంగారావు చెయ్యి తన చేతికి తగుల్తోంది. మనోరమ చిరునవ్వు నవ్వుతుంది. ఈ రంగారావేనా......తనవైపు సరిగా చూడనుకూడా చూడ లేదు ఆరోజు! తన తళుకుబెళుకులకి చలించలేదు!

రంగారావుకి మనసులో ఏదో మెదుల్తోంది.

మనోరమ దగ్గరికి జరగాలనిపిస్తోంది.

ఆమె కలలు కంటోంది—సొంత ట్రూపుతో జేగీయమానంగా—రంగారావు డబ్బుతో...

రంగారావు, పాపం.

కాని పెట్టుబడికావాలి తనకి.

మనోరమ వేశ్య—ఆ విషయం తెలుసు రంగారావుకి. కాని అతడు ఆలోచించటం మానేశాడు. పరిస్థితుల్ని అతడు అతిక్రమించదలచుకోలేదు. విసుగ్గా ఉన్నాడు. సినిమా చూసి అలిసిపోయాడు. మత్తు మత్తుగా...చీకటీ, గాలీ...మనోరమ ఊపిరి వెచ్చగా తగుల్తోంది...

రంయిమని కోశాడు డ్రైవర్, సందు తిరగటానికి.

ఆ వాలుకి తూలింది మనోరమ!

రంగారావు ఆపాడు—ఆమె జబ్బలు పట్టుకుని.

మనోరమ వెంటనే సర్దుకోలేదు.

"సారీ", అనలేదు.

"పరవాలేదు", అనే అవకాశమే లేదు.

మనోరమ నవ్వింది. రంగారావు నవ్వాడు. ఆమె లేవలేదు. రంగారావు ఆమెచేతులు వదల్లేదు.

కారు దూసుకుపోతోంది—నడిచేవాళ్ళని కవ్విస్తూ...

నడుస్తున్నాడు రామ్మూర్తి.

ఎవరో జనం ఎదురుగా వొస్తున్నారు.

పరకాయించిచూశాడు—ఎలిక్ట్రిక్ లైట్ వెలుగులో.

ఎదురింటివాళ్ళు—వాళ్ళలో ఆ అమ్మాయిలేదే!

ఎందుకో! వాళ్ళఅమ్మా, తమ్ముడూ, ఇంకా ఎవరో — చుట్టుపక్కలవాళ్ళూ... ఆ అమ్మాయి ఎందుకు రాలేదు! అసలే సినిమాపిచ్చి. మరి...ఆలోచిస్తున్నాడు రామ్మూర్తి.

ఆ పిల్ల ఉత్త వెర్రిబాగులదల్లే ఉంది. ఎప్పుడూ అలా ఆ మేడగది కిటికీదగ్గర నిలబడి పాడుతూ ఉంటుంది—సినిమా పాటలూ, ప్రేమగీతాలు. ఈ ఊరు వొచ్చినప్పటినించీ చూస్తున్నాడు. కథల పత్రికలు చదువుతూ, డాబామీద తిరుగుతూ, కూనిరాగాలు తీస్తూ, రోడ్డుమీద వొచ్చేపోయే జనం చూస్తూ—అప్పుడప్పుడు తనవైపు అలా చూస్తుందేం? తనూ పాడతాడు. తను పాడుతుంటే అలా నిలబడి చూస్తూ...

రామ్మూర్తికి ఏవేవో ఆలోచనలు సాగుతున్నాయి.

ఫూలిష్ గరల్.

చెప్పేవాళ్ళెవరూ లేనట్టున్నారు.

ఎప్పుడో సినిమాఫీల్డులోకి ఉరుకుతుంది. చూడటానికి బాగానే ఉంటుంది. ఏ చిత్రంలోనో బుక్ అయితే...

అతనికి నవ్వొచ్చింది. చిత్రంలో బుక్ కావటం మాటలా ?

రామ్మూర్తి ఆలోచిస్తూ, గది చేరుకుని లైటు వెలిగించాడు. బ్రహ్మచారి కొంప. అంటే రామ్మూర్తికి పెళ్ళి కాలేదనికాదు. రెండు సంవత్సరాల కిందటే ఐంది. భార్య ప్రస్తుతం పుట్టింట్లో ఉంది—కాన్పుకి. ఇప్పట్లో వొచ్చే అవకాశంలేదు. అందువల్ల ఓ గది అద్దెకి తీసుకుని ఉంటున్నాడు—ఆ కొత్త ఊరికి వొచ్చినప్పటినించీ. గది చిందరవందరగా ఉంది. విసుగ్గా కుర్చీలో కూలబడి మేడవైపు యథాలాపంగా చూశాడు.

ఆ గదిలో లైటు వెలిగింది.

కిటికీలోంచి...

ఫూలిష్ గరల్. తనవైపు చూస్తున్నట్టుగా ఉంది. బహుశా, ప్రేమపిచ్చి! రామ్మూర్తి నవ్వుకున్నాడు.

రామ్మూర్తి బాఫుంటాడు. ఆ విషయం అతనికి తెలుసు. ఏదో పాట అందుకున్నాడు. జంట పాట. విరహగీతం, అందుకొంటూ, రామ్మూర్తి మనసులోకి దొంగతనంగా తొంగిచూశాడు.

తనా పాట ఎందు కందుకున్నాడు !

ఆమె నిలబడి వింటున్నది.

వింటుందని తనకి తెలుసు. పిచ్చిపిల్ల !

ఆమె ఒక్క క్షణం అదృశ్యమైంది. తరవాత మళ్ళీ ప్రత్యక్షమైంది.

ఆమె ఏదో సంజ్ఞ చేస్తున్నట్టుంది... తనకే !

రామ్మూర్తి కొంచెం చలించాడు. అందుకనేనా ఆమె సినిమాకి వెళ్ళలేదు !

కిటికీలోంచి ఏదో కాగితం ఉండచుట్టి గది ముందు పడేలా విసిరింది.

సాహసం ! కాసేపు అలాగే కూచుని తరవాత తెలివి తెచ్చుకుని రామ్మూర్తి అప్రయత్నంగా గదితలుపుదగ్గరికి వెళ్ళాడు, కాగితం తీసుకోవాలని.

ఎవరో కాలేజీ కుర్రాళ్ళల్లే ఉన్నారు...ఇద్దరు అప్పుడే గది దాటి పోతున్నారు—మాట్లాడుకుంటూ.

రామ్మూర్తి ఆగాడు వాళ్లు వెళ్ళేదాకా.

వాళ్లు సినిమాగురించే మాట్లాడుకుంటున్నారు.

రామ్మూర్తి గుండె కదుటబడ్డది. వాళ్లు చూళ్ళేదన్న మాట. వాళ్లు గది దాటగానే కాగితం విప్పిచూశాడు. రెండే ముక్కలు. తనని ప్రేమిస్తోందిట !

ఫూలిష్ గరల్. ప్రేమపిచ్చి. తను ఒంటరిగాడు కాడని తెలియదు.

ఆ అమ్మాయి అక్కడే నిలబడి ఉంది.

రామ్మూర్తికూడా అక్కడే నిలబడ్డాడు.

అతడు సంకోచిస్తున్నాడు—లాంఛనప్రాయంగా.

తను పాట ఎందుకు పాడాడు! ఎందుకో రామ్మూర్తికి మనసు జ్ఞాపకం చెయ్యబోగా అతడు విననట్లు నటించాడు. ఆమెకి పాట ఇష్టం......ఆ దౌర్బల్యం ... రామ్మూర్తి విసుక్కున్నాడు తన మీద. ఎలాగైనా ఆమె సినిమాలో తప్పక చేరుతుంది. ఆమె తత్త్వం అటువంటిది.

"ఆధారా లేమి", టని నిలదీసి అడిగితే రామ్మూర్తికి కోపం వొస్తుందని అతనికీ తెలుసు. అందుకే అడగలేదు.

ఆమె సినిమాల్లో చేరిపోతుంది.

చేరింతరవాత ఎలాగో...ఎలాగో...తప్పదు.

అప్పుడామెకి మంచి భవిష్యత్తే ఉంటుంది.

ఏమేమిటో ఆలోచించాడు రామ్మూర్తి. అతనికి విసుగుపుడుతోంది.

ఎదురెదురుగా—

రామ్మూర్తి మేడవైపు నడిచాడు...

ఇంకా సినిమాగురించే మాట్లాడుకుంటున్నారు ఆ కాలేజీ కుర్రాళ్ళిద్దరూ—

"అందరూ ఆమోదించేదీ, ఇంచుమించు ఎవ్వరూ ఆచరించనిదీ ఏమిటో చెప్పగలవా ?" స్నేహితుణ్ణి అడిగాడు కాలేజీ కుర్రాడు.

"ఏమిటి ?"

"పోనీ, ఇంచుమించు ఎవ్వరూ ఆమోదించనిదీ, అందరూ ఆచరించేదీ ఏమిటో చెప్పు."

"నువ్వే చెప్పేసెయ్యి."

"మొదటిది ధర్మం, రెండోది అధర్మం."

రెండో కుర్రాడు నవ్వాడు.

"నువ్వు కొంచెం తమాషాగా అన్నా అది నిజమే. వేశ్యకూడా వేశ్యని అసహ్యించుకొంటుంది. కాని..."

"ఏంలాభం?" మొదటి కుర్రాడు పెదవి విరిచాడు.

"అందుకే మానవుడి భవిష్యత్తుమీద ఇంకా నాకు నమ్మకముంది," అన్నాడు రెండో కుర్రాడు. మొదటివాడు మౌనంగా ఆలోచిస్తున్నాడు...

మనోరమ నడుంచుట్టు చెయ్యి వేశాడు రంగారావు.

నిర్జన ప్రదేశంలో రిక్షా ఆగింది.

మేడగది సమీపించాడు రామ్మూర్తి.

—అది వర్తమానం.